
సాక్షి
వికారాబాద్

బుధవారం । 8 । నవంబర్ । 2023



ప్రచారానికి వేతనం!

తాండూరు అసెంబ్లీ నియోజవకర్గం ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల ప్రచారం సాధారణంగా నిర్వహించే వారు. 10లో▸



ఎన్నికల నేరానికి శిక్ష..!

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం. ఎన్నికల వేళ నేతలు ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తారు. 10లో▸



పైసలు ఇస్తేనే పనికి!

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన హరిత హారం కార్యక్రమం మండలంలో నత్త నడకన కొనసాగుతోంది. 11లో▸

న్యూస్‌రీల్

జనసేన తాండూరు అభ్యర్థిగా నేమూరి



తాండూరు: జనసేన తాండూరు అసెంబ్లీ అభ్యర్థిగా నేమూరి శంకర్‌గౌడ్ పేరును ఖరారు చేశారు. నగరంలోని జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన శంకర్‌గౌడ్ గతంలో జనసేన పార్టీ తరఫున సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా తాండూరు నుంచి పోటీ చేయనున్నారు. నేమూరి శంకర్ గౌడ్ వ్యాపారాలు చేస్తునే పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోండి

జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు బుధవారం సాయంత్రం 5గంటల లోపు ఫామ్-12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 80 సంవత్సరాలు, ఆపై వయస్సు కలిగిన వయోవృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు, అత్యవసర సేవలు అందించే ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, సమాచార పౌర సంబంధాల శాఖ, రైల్వే, పోస్టల్ తదితర శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, కోవిడ్ దీర్ఘకాలిక బాధితులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు ఫామ్-12డీని పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఓటరు జాబితాలో ఉన్న పూర్తి వివరాలను ఫామ్-12డీలో పొందుపరుస్తూ బుధవారం సాయంత్రం 5గంటల లోపు సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేయాలని కలెక్టర్ సూచించారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు



వికారాబాద్ సమీపంలోని ఓ రిసార్టులో తనిఖీల కోసం వచ్చిన ఎక్సైజ్ పోలీసులు

వికారాబాద్ అర్బన్: ఎన్నికల విధుల్లో భాగంగా పలు రిసార్టుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవీణ తెలిపారు. మంగళవారం సీఐ తన బృందంతో వికారాబాద్ చుట్టు పక్కల ఉన్న పలు రిసార్టులను తనిఖీ చేశారు. మద్యం నిల్వ చేయడం చట్టవిరుద్ధమని రిసార్టు యజమానులకు సూచించారు. మద్యం పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బూత్‌స్థాయి నాయకులే కీలకం

తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్



బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంతో మాట్లాడుతున్న విష్ణుప్రసాద్

పరిగి: పార్టీ అభ్యర్థి గెలుపులో బూత్‌స్థాయి నాయకులే కీలకమని తమిళనాడు ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి విష్ణుప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గ్రీన్ పార్క్ హాల్‌లో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, బూత్‌స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికలకు బూత్ స్థాయి నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకుందా మని, ఈ సారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి బహుమతిగా ఇద్దామని ఆయన అన్నారు. బూత్ స్థాయి నాయకులు కష్టపడి పార్టీకి మెజారిటీ తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఏఏ బూత్‌లో పార్టీ బలహీనంగా ఉందో గుర్తించి పటిష్ట పరిచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ అభ్యర్థి టీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 రోజులు కష్టపడి పనిచేస్తే ఐదు సంవత్సరాలు పేదలకు సేవ చేసే అవ కాశం లభిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏఏ పనులు చేస్తుందో ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

రూ.4.50 లక్షలు పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్ : ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తున్న పలువురు వ్యక్తుల నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మంగళవారం రూ.4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పెద్దఅంబర్‌పేట ఔటర్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మన్మోహన్ తెలిపారు.

డీసీసీబీ లొల్లి



బీఎంఆర్ బీఆర్ఎస్ వీడటంతో తెరపైకి డీసీసీబీ చైర్మన్ పదవి

- ఇంకా రాజీనామా చేయని మనోహర్‌రెడ్డి
- కొత్త చైర్మన్ ఎవరనే దానిపై తీవ్ర చర్చ
- ఇంకా ఏడాదిన్నర పాటు పదవీ కాలం
- అనిల్‌రెడ్డికి అవకాశం ఉండొచ్చని ప్రచారం
- పదవిపై కన్నేసిన మరికొందరు

వికారాబాద్: డీసీసీబీ తరువాత చైర్మన్ ఎవరనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం దీనికి సమయం సందర్భం కాపోయినా ఈ విష యం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2020 లో జరిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అధికార బీఆర్ఎస్ అత్యధిక పీఏసీఎస్ చైర్మన్ సీట్లను గెలుచుకున్న విషయం తెలిసిందే. దీంతో ఆ పార్టీ నాయకుడు, పరిగి నియోజకవర్గం కల్కచర్ల మండలానికి చెందిన బుయ్యని మనోహర్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మూడున్నర ఏళ్ల పదవీ కాలం పూర్తి అయ్యింది. మరో ఏడాదిన్నర మిగిలి ఉంది. కాగా ఆయన ఇటీవల అధికార బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే.

పార్టీ మారడంతో చైర్మన్ పదవిపై చర్చ

అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన మనోహర్ రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. డీసీసీబీ చైర్మన్ పదవికి మాత్రం చేయలేదు. అయితే బీఆర్ఎస్ తరఫున చైర్మన్ పదవి పొందిన ఆయన కాంగ్రెస్ గూటికి చేరడంతో తదుపరి చైర్మన్ ఎవరనేది ప్రస్తుతం చర్చనీయాంశం అయ్యింది.

ఆయన పదవీ కాలం మరో ఏడాదిన్నర ఉంది. అయితే ఆ పదవికి ఆయన స్వచ్ఛందగా రాజీనామా చేయడం లేదా అవిశ్వాసం పెట్టి తొలగించడం గానీ చేస్తే తప్ప మరొకరు చైర్మన్ కావటానికి వీలులేదు. ఈ క్రమంలో ఆయనే బలనిరూపన చేసుకుంటే పూర్తికాలం కొనసాగే అవకాశం కూడా ఉంది. మనోహర్‌రెడ్డి ప్రస్తుతం తాండూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయన గెలుపొందితే స్వచ్ఛందంగా చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.

చైర్మన్ పదవిపై పలువురి కన్ను

ఒకవేళ ప్రస్తుత డీసీసీబీ చైర్మన్ స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే ప్రస్తుతం ఉన్న డైరక్టర్లలో ఒకరిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే కొత్త వ్యక్తిని డీసీసీబీ చైర్మన్‌గా చేయాలని భావిస్తే ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్ చైర్మన్లలో ఒకరిని రాజీనామా చేయించి ఆ స్థానంలో తిరిగి కొత్త వ్యక్తిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఆ వ్యక్తిని పీఏసీఎస్ చైర్మన్లు డైరక్టర్‌గా ఎన్నుకోవాలి. ఆ తరువాత ఆయన్ను డీసీసీబీ చైర్మన్‌గా నియమించే అవకాశం ఉంటుంది. అయితే ఇప్పటికే పలువురు ఆ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సోదరుడు అనిల్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇతనికి డీసీసీబీ చైర్మన్ పదవి ఇస్తామని మంత్రి కేటీఆర్ మాట ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ప్రస్తుతం పరిగి నియోజకవర్గానికి చెందిన వ్యక్తే ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న నేపథ్యంలో మిగిలిన పదవి కాలం కూడా ఈ నియోజకవర్గ వాసికే ఇవ్వనున్నట్లు సమాచారం. ఇదే సమయంలో జిల్లాకు చెందిన మరి కొందరు కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు.

వికారాబాద్‌కు పెద్దింటి | కొడంగల్‌కు బంటు

బీజేపీ నాలుగో జాబితాలో ఇద్దరికి చోటు

వికారాబాద్ అర్బన్: బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ టికెట్‌ను పెద్దింటి నవీన్ కుమార్ దక్కించుకున్నారు. ఆ పార్టీ మంగళవారం ప్రకటించిన నాలుగో జాబితాలో ఆయనకు చోటు దక్కింది. ప్రస్తుతం నవీన్ కుమార్ బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2008లో బీజేపీలో చేరిన ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వస్తున్నారు. దీంతో పార్టీ అధిష్టానం ఆయనకు టికెట్ కేటాయించింది. వికారాబాద్ ఎస్సీ నియోజకవర్గం కావడంతో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా కూడా ఇక్కడి నుంచి టికెట్ ఆశించారు. చివరి వరకు వీరి మధ్య పోటీ ఉండగా స్థానికుడైన నవీన్‌కుమార్ వైపే పార్టీ మొగ్గు చూపింది. 2018 ఎన్నికల కంటే ఇప్పుడు నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని, పైగా ఇదే నియోజకవర్గానికి చెందిన టీ సదానంద్ రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఉండటం, నియోజకవర్గంలో 20వేల పార్టీ సభ్యత్వం ఉండటం కలిసి వస్తుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ డిపాజిట్ కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో కచ్చితంగా తమ మార్కు చూపిస్తామని బీజేపీ శ్రేణులు అంటున్నారు.

కొడంగల్ అభ్యర్థిగా..

బీజేపీ కొడంగల్ టికెట్‌ను బంటు రమేష్ ముదిరాజ్ దక్కించుకున్నారు. దీంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ నేపథ్యం: ఏబీవీపీ మండల అధ్యక్షుడిగా, కొడంగల్ భాగ్ ప్రముఖ్‌గా, వికారాబాద్ ఏబీవీపీ నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ఖమ్మం జిల్లా సంఘటన కార్యదర్శిగా, అస్సాం రాష్ట్ర సంఘటన కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. సాందీపని పత్రికకు ఎడిటర్‌గా పని చేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర ట్రైనింగ్ సెల్ కోకన్వీనర్‌గా పని చేశారు. ప్రస్తుతం బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.



పేరు:	పెద్దింటి నవీన్ కుమార్
వయస్సు:	40 ఏళ్లు
పుట్టిన తేదీ:	1-1-1982
తల్లిదండ్రులు:	మణెమ్మ, చంద్రయ్య
భార్య:	రమాదేవి
పిల్లలు:	ఇద్దరు కూతుళ్లు
విద్యార్హత:	డిగ్రీ, బి.పి.ఈ.డి,
గ్రామం:	బురాన్‌పల్లి, వికారాబాద్ మం.
సామాజికవర్గం:	ఎస్సీ మాదిగ



పేరు:	బంటు రమేష్ ముదిరాజ్
భార్య:	సౌజన్య, ఇద్దరు సంతానం
తల్లిదండ్రులు:	అంజమ్మ, లాలప్ప
పుట్టిన తేదీ:	15-01-1980
స్వస్థలం:	కోస్గి
విద్యార్హత:	ఎంఎస్సీ, ఎంసీజే, ఎల్ఎల్‌బీ
వృత్తి:	విద్యాసంస్థల నిర్వహణ, రియల్ ఎస్టేట్, చిట్‌ఫండ్స్

కేసీఆర్‌ను ప్రజలు నమ్మడం లేదు

- రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారు
- కాంగ్రెస్ పరిగి అసెంబ్లీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రామ్మోహన్‌రెడ్డి

పరిగి: మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని కాంగ్రెస్ పార్టీ పరిగి అసెంబ్లీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం దోమ మండలం శివారెడ్డి పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పార్టీల నేతలు సుమారు 100మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని, ప్రస్తుత ఎన్నికల్లో తాము అఖండ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీని గెలిపించాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. తనను భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే రోల్ మోడల్ తెలంగాణ



మల్లెమోనిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారు
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: దేశంలో తెలంగాణ తరహా అభివృద్ధి ఏ రాష్ట్రంలో కూడా జరగలేదని, ఇది సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరిగి ఒకటవ వార్డు మల్లెమోనిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, 24గంటల విద్యుత్, దళితబంధు, ఆసరా పెన్షన్లు దేశానికే ఆదర్శమన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పరిస్థితి ఎలా ఉండేదో, ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలు గుర్తించి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు గోస పడ్డారని అన్నారు. ఎరువుల కోసం రెండు మూడు రోజుల నిరీక్షించాల్సి వచ్చేదని తెలిపారు. కానీ బీఆర్ఎస్ పాలనలో ఈ కష్టాలేమీ లేవని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కోఆప్షన్ జిల్లా మాజీ సభ్యుడు మీర్ మహ్మద్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవీందర్, కిరణ్, వెంకటేష్, రవికుమార్, మౌలానా పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

- ఎస్పీ కోటిరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

వికారాబాద్ అర్బన్: ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయం నుంచి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తేవాలని సూచించారు. సున్నితమైన గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, నగదు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రసీదులు లేకుండా వెండి, బంగారం తరలిస్తే సీజ్ చేయాలని సూచించారు. రౌడీ షీటర్స్, పాత నేరస్తులను వెంటనే బైండోవర్ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పెళ్లికి రూ.లక్ష, తులం బంగారం

- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- కాంగ్రెస్ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- అమ్ముడుపోయిన రోహిత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



బీజేపీ మండల అధ్యక్షురాలు వీరమణికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పదని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని ఆ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాశీంపూర్, కుప్పన్‌కోట్, బాద్లాపూర్, గొట్టిగకలాన్, గొట్టిగఖుర్దు, రెడ్డిఘణాపూర్, మంతట్టి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ. లక్ష సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు ఒకే విడతలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఇంట్లో ఒకరికి మాత్రమే పింఛను ఇచ్చి అవ్వ తాతకు గొడవ పెడుతోందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఎంతమంది అర్హులు ఉంటే వారందరికీ చేయూత పథకం కింద రూ.4 వేల చొప్పున మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ సాధించుకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని తుంగలోతొక్కిందని విమర్శించారు. తాండూరు పరిధిలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టగానే అర్హులందరికీ 100 గజాల స్థలం తోపాటు ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించారు. పేదల ఇళ్ల సమస్య ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి పట్టలేదని, తాను మాత్రం కోట్ల రూపాయలతో వైట్ ప్యాలెస్ కట్టుకున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని 2,500 మంది గొల్లకుర్మలతో రూ.45 వేల చొప్పున కట్టించుకొని గొర్రెలు పంపిణీ చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బీఆర్ఎస్‌కు అమ్ముడు పోయిన రోహిత్‌రెడ్డికి ప్రస్తుత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఓటర్లను కోరారు. తనను గెలిపిస్తే తాండూరును సిద్దిపేట కంటే ఉన్నతంగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

హస్తం గూటికి బీజేపీ మండల అధ్యక్షురాలు

బీజేపీ బషీరాబాద్ మండల అధ్యక్షురాలు వీరమణి మంగళవారం మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటి కావడంతో తాను, తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. తాండూరులో మనోహర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు.

మనోహర్‌రెడ్డి మంత్రి అవుతారు

మనోహర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పిలుపునిచ్చారు. సౌమ్యుడైన మనోహర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిస్తే మంత్రి అవుతాడని జోస్యం చెప్పాడు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా కట్టలేక పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాకేష్, సీనియర్ నాయకుడు వెంకటేష్ మహరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింలు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి.. పెరుగుతోంది మళ్లీ

పైపైకి చేరుతున్న ధర

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.75
- కొనలేమంటున్న సామాన్యులు
- ధరలకు కళ్లెం వేయాలని విజ్ఞప్తి

హుడాకాంప్లెక్స్: ఉల్లి.. కోస్తే కాదు వంటింట్లో ఆ పేరు వినిపిస్తే చాలు మహిళల కంట్లో కన్నీరు తెప్పిస్తోంది. రియల్ ఎస్టేట్ కారణంగా జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గడం, వర్షాభావంతో ఇతర జిల్లాల్లో ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడం, డిమాండ్ మేరకు మార్కెట్‌లో సరఫరా లేకపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.75 పలుకుతోంది. ఎన్నికల వేళ ఉల్లి ధరలు అమాంతం పెరగడం ప్రతిపక్ష పార్టీలకు ప్రచారాస్త్రంగా మారింది.

బిర్యానీల్లో కనిపించని ఉల్లి

చికెన్, మటన్, చేపలు, పచ్చిపులుసు, సాంబారు, బిర్యానీ, ఆకుకూరలు, కూరగాయల్లో ఉల్లి వినియోగం తప్పనిసరి. సలాడ్‌గా కూడా దీన్ని వినియోగిస్తుంటారు. మహారాష్ట్ర, కర్ణాటక, రంగారెడ్డి, వికారాబాద్, కర్నూలు జిల్లాల్లో ఈ పంటను ఎక్కువగా పండిస్తుంటారు. ఈ ఏడాది నెల కొన్న వర్షాభావంతో పంట సాగు తగ్గింది. దిగుబడి కూడా ఆశించినంతగా లేదు. మార్కెట్‌లో డిమాండ్‌కు, సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. నిన్న మొన్నటి వరకు కేజీ రూ.10 నుంచి రూ.15కే లభించేది. తాజాగా మేలు రకం పాత గడ్డ రూ.75కు చేరింది. కొత్తగడ్డ సాధారణ రకం కేజీ రూ.40కి లభిస్తోంది.

హోటళ్లలో సలాడ్స్ మాయం

కొంత మంది (ముఖ్యంగా హోటళ్లు, క్యాటరింగ్ ఏజెంట్లు, కర్రీ పాయింట్) ఉల్లి లేకుండానే కూరలు తయారు చేస్తుండగా, మరికొంత మంది ఒకే ఉల్లి గడ్డను రెండు మూడు భాగాలు చేసి, రోజుకు కొంత వాడుతుండటం విశేషం. చికెన్, మటన్ బిర్యానీల్లోనూ, వాటితో పాటు సరఫరా చేసే సలాడ్స్ లోనూ ఉల్లి మచ్చుకైనా కన్పించడం లేదు. ఉల్లి స్థానంలో క్యాబేజీని వినియోగిస్తున్నారు. సలాడ్స్‌లో కీరా ముక్కలు ఇస్తున్నారు.



ఉల్లి ధరను సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

ఉల్లి కొనడం లేదు



వంటలో కనీసం రెండు మూడు ఉల్లిగడ్డలు వాడేదాన్ని.ప్రస్తుతం ఒకదాంతోనే రెండు రోజులు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఉల్లిని కొనలేక పప్పు, పచ్చడితో సరిపెట్టుకుంటున్నాం.

– సంధ్యారాణి, సరూర్‌నగర్

క్లుప్తంగా

ఇద్దరే అమాత్యులు!

మూడు దశాబ్దాలుగా
మళ్లీ దక్కని మంత్రి పదవి


చిత్తరంజన్‌దాస్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంనుంచి విజయం సాధించిన ఎమ్మెల్యేలలో ఇప్పటివరకు ఇద్దరికి మాత్రమే మంత్రి పదవులు వరించాయి. 1962 ఎన్నికలలో లట్టుపల్లి వెంకట్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మంత్రి వర్గంలో ఆయన చోటు దక్కించుకున్నారు. 1989 ఎన్నికల్లో టీడీపీ అధినేత ఎన్టీఆర్‌ను ఓడించిన కాంగ్రెస్ అభ్యర్థి చిత్తరంజన్‌దాస్ సంచలనం సృష్టించారు. అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రివర్గంలో కార్మిక, ఉపాధి కల్పన, టూరిజం, బీసీ సంక్షేమ శాఖామంత్రిగా పనిచేశారు.

రూ.4.50 లక్షలు పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్ : ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తున్న పలువురు వ్యక్తుల నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మంగళవారం రూ.4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పెద్దఅంబర్‌పేట ఔటర్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మన్మోహన్ తెలిపారు.

ప్రచారానికి వేతనం!

నిన్నటి దాకా పనులు దొరక్క ఇబ్బంది పడిన కూలీలకు అసెంబ్లీ ఎన్నికలతో చింత తీరింది. వివిధ పార్టీల నేతల ప్రచారానికి వీరు ఆసరాగా నిలుస్తున్నారు. స్థానికంగా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సరిహద్దు ప్రాంతాలనుంచి కూలీలను తీసుకువచ్చి వెంట తిప్పుకుంటున్నారు.

బలగం చూపించుకునేందుకు అభ్యర్థుల పాట్లు



- యువతకు రూ.వెయ్యి వరకు చెల్లింపు
- స్థానికంగా డిమాండ్ ఉండడంతో సరిహద్దుల నుంచి తరలింపు
- ఖర్చుకు వెనుకాడని నేతలు

తాండూరు: తాండూరు అసెంబ్లీ నియోజవకర్గం ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల ప్రచారం సాధారణంగా నిర్వహించే వారు. దశాబ్ద కాలంగా ఇక్క భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు భారీ బలగంలా.. వందలాది వాహనాలతో వెళ్లి ఓటర్లను ఆకర్శిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల నుంచి ఎన్నికల బరిలో నిలిచిన నేతలు భారీ బైక్ ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహిస్తూ తమ సత్తాచాటేందుకు తహ తహలాడుతున్నారు.

200 మందికి కాంట్రాక్టు

ఎన్నికల ప్రచారానికి బైక్ ర్యాలీలతో రోడ్ షో చేసేందుకు ద్విచక్రవాహనదారులను గుర్తిస్తున్నారు. ఈ బాధ్యత ద్వితీయ శ్రేణి నాయకులకు, అనుచరులకు అప్పగిస్తున్నారు. బైక్ ఉన్న వారికి ముందస్తుగా పెట్రోల్ రూ.200, అభ్యర్థితో కలిసి ప్రచారం చేసేందుకు రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి 200 మందికి వేతనాలు చెల్లించి మరీ ప్రచారం చేస్తునన్నారనే చర్చ వినిపిస్తోంది. కార్యకర్తలకు డబ్బు, భోజనం, రాత్రికి మద్యం అందిస్తామని చెప్పినా ప్రచారానికి రావడం కష్టంగా మారింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. కార్యకర్తలు ప్రచారానికి తీసుకువచ్చేందుకు ఒక్కరికి కాంట్రాక్ట్ ఇస్తున్నారు. కాంట్రాక్ట్ తీసుకొన్న వ్యక్తి వాహనాలను సమకూర్చి ఎన్ని బైకులు కావాలో అన్ని బైకులు ప్రచారానికి పంపిస్తున్నారు. రెండు మూడు గంటల పాటు ప్రచారం చేశాక అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.

ఓటర్ల ప్రసన్నానికి పాట్లు

తాండూరు అసెంబ్లీ పరిధిలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ సెగ్మెంట్‌లో వారి అభ్యర్థి గెలుపునకు కీలకం కానున్నాయి. అయితే వారిని ఆకర్శించేందుకు మహిళలను భాగస్వామ్యం చేసేందుకు సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థుల కుటుంబ సభ్యులే ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారానికి వచ్చే మహిళలకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు చెల్లించేదుకు అభ్యర్థులు వెనుకాడడం లేదనే ప్రచారం కొనసాగుతోంది. ప్రధాన పార్టీ అభ్యర్థుల ప్రచారంలో వేల సంఖ్యలో పాల్గొనడం ఇందుకు బలం చేకూరుతోంది.

ఎన్నికల నేరానికి శిక్ష..!

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



షాద్‌నగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. ఎన్నికల వేళ నాయకులు ఓటర్లు ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఏవిధంగానైనా విజయం సాధించేలానే పట్టుదలతో ఆవేశంలో తప్పులు చేస్తుంటారు. ఓట్లు రాబట్టేందుకు బెదిరింపులకు పాల్పడుంటారు. అయితే ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యానికి రక్షణ కల్పిస్తుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారు శిక్షార్హులు అవుతారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షలు

- నామినేషన్ ధాఖలు చేసేటప్పుడు తప్పుడు సమాచారం ఇస్తే ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా జరిమానా.
- ఎన్నికల అధికారులు, సిబ్బంది ఓటర్లను ప్రభావితం చేస్తే ఆరు నెలల పాటు జైలు శిక్ష.
- సభలు సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి. ఎన్నికల సమయానికి 48 గంటల ముందే బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించవద్దు. ఓటర్లను ఆకట్టుకునే విధంగా వినోదాత్మక కార్యక్రమాలు చేపడితే రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.
- కుల, మత విద్వేశాలను రెచ్చగొట్టే విధంగా వ్యహరిస్తే మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా.
- ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత గొడవలకు పాల్పడితే ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటుగా రూ.2వేల జరిమానా.
- మద్యం, డబ్బు పంపిణీ చేస్తే ఆరు నెలల జైలు శిక్షతో పాటుగా రూ.200 జరిమానా.
- ఎన్నికల కరపత్రాలు, వాల్‌పోస్టర్లపై ముద్రించిన వారి పేరు చిరునామా విధిగా ఉండాలి. ఒక కాపీని తప్పనిసరిగా ఎన్నికల అధికారులకు ఇవ్వాలి. లేదంటే ఆరు నెలల శిక్ష లేదా రూ.2వేల జరిమానా.
- పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహిస్తే రూ.250 జరిమానా.
- లౌడ్‌స్పీకర్లు పెట్టి అరవడం, ఇతరులపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే మూడు నెలల జైలు శిక్ష.
- ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా పనిచేయవద్దు. ఇలా చేయడం చట్ట రీత్యా నేరం. వారికి మూడు నెలల శిక్ష.
- ప్రచార వాహనాలకు అనుమతి లేకుంటే మూడు నెలల జైలు శిక్ష.
- ఈవీఎంలు ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తే ఏడాది పాటు జైలు.
- పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే ఏడాదికి తగ్గకుండా.. మూడేళ్లకు మించకుండా జైలు శిక్షతో పాటుగా జరిమానా విధిస్తారు.
- ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. అందకు విరుద్ధంగా వ్యవహరిస్తే శిక్షార్హులు.
- రిగ్గింగ్, దొంగ ఓట్లేసేందుకు యత్నిస్తే శిక్షార్హులు
- నగదు, మద్యం, బంగారు, వెండి ఆభరణాలు రవాణా చేసినా.. ఓటర్లకు పంచినా కేసులు, శిక్షలుంటాయి.

కఠిన చర్యలు



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతో కీలకం. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాం. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

– ప్రతాప్ లింగం, సీఐ, షాద్‌నగర్ టౌన్

అనుమతులు తప్పనిసరి



ఎన్నికల ప్రచారం కోసం ఆయా పార్టీల నేతలు నిర్వహించే సభలు సమావేశాలు, ర్యాలీలకు విధిగా అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా వాహనాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవు.

– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్

ఓటు జీవితావసరం



సెలబ్రిటీ కామెంట్

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి జీవితావసరం అని గుర్తుంచుకోవాలి. ప్రతి మనిషికి ఆహారం, వస్త్రాలు, ఇల్లు మాదిరిగానే ప్రతి వయోజనుడికీ ఓటు కూడా తన కనీస అవసరంగా భావించాలి. ప్రపంచంలోనే మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. యువత అత్యధికంగా ఉన్న దేశం కూడా. యువత ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొనాలి. నేటి యువతరం అన్ని రంగాల్లోనే చురుకుగా, మెలకువతో వ్యవహరిస్తోంది. ఓటింగ్ దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఆసక్తి చూపట్లేదు. రేపు నాయకులు కాదల్చితే నేడు కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. నగరంలో ఉన్న సీనియర్ సిటిజన్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి, తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి యువత సహకరించాలి. మా పెద్ద కుమార్తె ప్రకృతికి ఈసారే ఓటు హక్కు వచ్చింది. మా కుటుంబంలోకి వచ్చిన ఈ కొత్త ఓటర్ మాలాగే కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోనుంది.

– బి.సుమతి, ఐపీఎస్

ఆ ముగ్గురి ప్రస్థానం అక్కడి నుంచే

- స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్యేలుగా ఎదిగిన నాయకులు
- సర్పంచ్ నుంచి ఇంద్రారెడ్డి
- జెడ్పీచైర్మన్‌గా పనిచేసిన కేఎస్.రత్నం
- సింగిల్ విండో చైర్మన్ నుంచి ఎదిగిన కాలె యాదయ్య



చేవెళ్ల: నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి 16 ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు గెలిచి నిలిచారు. వీరిలో దివంగత ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక సంస్థల నుంచి ప్రజాప్రతినిధులుగా తమ ప్రస్థానం ప్రారంభించి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో ఇంద్రారెడ్డి మంత్రి పదవిని సైతం చేపట్టారు.

సర్పంచ్ పదవిలో ఉండగానే..

మండల పరిధిలోని కొంకుంట్ల గ్రామానికి చెందిన పటోళ్ల ఇంద్రారెడ్డి 1981లో ఆ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా పనిచేస్తుండగానే 9185లో వచ్చిన శాసన సభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. గతంలో ఆయన జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. దీంతో ఆయన 1985లో టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.నాటి నుంచి ఆయన వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రెండు పర్యాయాలు మంత్రిగా సేవలందించారు.

పార్లమెంట్ వద్దంది.. అసెంబ్లీ ఆహ్వానించింది

నియోజకవర్గ పరిధిలో మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేఎస్. రత్నం శంషాబాద్ జెడ్పీటీసీ సభ్యుడి గా గెలిచి 1995లో రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా పని చేశారు. అనంతరం ఆయన సైకిల్ పై హైదరాబాద్ ఎంపీగా, 2004 లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తదనంతరం చేవెళ్ల అసెంబ్లీ స్థానం ఎస్సీలకు రిజర్వు చేయడంతో 2009లో ఆయన టీడీపీ నుంచి పోటీ చేసి చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీఆర్ఎస్, 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో చేరి ఎమ్మెల్యే బరిలో నిలిచారు.

అంచలంచెలుగా ఎదిగిన నేత

నియోజకవర్గంలోని నవాబుపేట మండలం చించల్‌పేట గ్రామానికి చెందిన కాలె యాదయ్య స్థానిక సంస్థల రాజకీయల నుంచే వచ్చారు. ఆది నుంచి హస్తాన్ని అంటి పెట్టుకున్న ఆయన 1992–95వరకు నవాబుపేట మండల సింగిల్ విండో చైర్మన్‌గా, డీసీఎంఎస్ డైరెక్టర్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు.1995–2000 వరకు నవాబుపేట జెడ్పీటీసీ సభ్యుడిగా, 2001–06 వరకు నవాబ్ ఎంపీపీగా పనిచేశారు. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా ఎదిగిన ఆయన 2009లో కేఎస్ రత్నం చేతిలో ఓటమి చవిచూశారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఆయన గులాబీ గూటిలో చేరారు. 2018లో కారు గుర్తుపై అసెంబ్లీకి వెళ్లారు. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ నుంచి చేవెళ్ల బరిలో నిలిచారు. హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా వ్యూహ రచనలు చేస్తున్నారు.

వీడిన ఉత్కంఠ

- చేవెళ్ల కాంగ్రెస్ బీఫాం భీంభరత్‌కే

చేవెళ్ల: ఎట్టకేలకు ఉత్కంఠకు తెరపడింది. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌కే పార్టీ బీఫాం దక్కింది. రెండు రోజులుగా అభ్యర్థిని మారుస్తారని జోరుగా ప్రచారం సాగింది. ఈ క్రమంలో మంగళవారం ఏఐసీసీ నాయకుడు మాణిక్‌రావు, ఠాక్రే చేతుల మీదుగా భీంభరత్ బీఫాం అందుకున్నారు. భీంభరత్‌కు బీఫాం రాకపోతే తమకే టికెట్ వస్తుందని ఆశించిన ఆశావహులు దీంతో ఉసూరుమన్నారు. మరోవైపు భీంభరత్ మద్దతుదారులు అన్ని మండల కేంద్రాల్లో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఇక కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు.


భీంభరత్‌కు బీఫామ్ అందిస్తున్న రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ నాయకులు

నామినేషన్ కేంద్రం పరిశీలన

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని మంగళవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ దాఖలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం 144 సెక్షన్ విధించామన్నారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే కేంద్రం లోపలికి అనుమతివ్వడం జరుగుతుందన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన వారిలో సీఐ లక్ష్మీరెడ్డి, డీఐ రాంరెడ్డి ఉన్నారు.

తాత్కాలిక కార్యాలయాలకూ..

- నిబంధనలు తప్పనిసరి
- ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు జారీ

మీకు తెలుసా?

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరఫున పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేస్తుంటారు. కార్యకర్తలు ఉదయం, సాయంత్రం కలుసుకుని ప్రచార సరళిపై చర్చించుకోవడం.. అభ్యర్థులు వచ్చిన సమయంలో మాట్లాడుకోవడానికి ఈ కార్యాలయాలు ఉపయోగపడుతుంటాయి. అయితే వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.

- పాఠశాలలు, ప్రార్థనా స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఏర్పాటు చేయొద్దు
- వీటిపై పార్టీ జెండా, బ్యానర్, చిహ్నాలు ఏర్పాటు చేసుకోవచ్చు.
- ఉదయం 6గంటల లోపు, రాత్రి 10గంటల సమయం దాటితే మైక్‌లు, లౌడ్ స్పీకర్లు వినియోగించొద్దు.
- ప్రచార తేదీ ముగిసిన తర్వాత ఓటర్లు కానివారు నియోజకవర్గంలో ఉండొద్దు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లకు ఈ నిబంధన వర్తించదు.
- రాత్రి 10 గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేయొద్దు.
- పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటరుగా నమోదైన ఫొటోతో కూడిన ఓటరు గుర్తింపు కార్డున్న వ్యక్తి మాత్రమే పోలింగ్ ఏజెంట్‌గా అర్హుడు.
- ఎస్ఎంఎస్ ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దు.

క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాలి

- రాచకొండ సీపీ చౌహాన్

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు కూడలిలో విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను మంగళవారం సాయంత్రం రాచకొండ సీపీ చౌహాన్, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి సందర్శించారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ గురించి సీఐ మన్మోహన్‌తో పాటు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల తనిఖీని క్షుణ్ణంగా చేపట్టాలని ఆదేశించారు.


సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ చౌహాన్

రూ.59 కోట్లు.. 9 కేసులు

- రూ.1.69 కోట్ల వారసత్వ ఆస్తి
- రూ.22.40 కోట్ల అప్పులు
- ఎలక్షన్ అఫడవిట్‌లో పేర్కొన్న కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: సుమారు రూ.59కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులున్నాయని, వివిధ పోలీస్‌స్టేషన్లలో తొమ్మిది కేసులున్నట్లు ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. చేతిలో రూ.5లక్షల నగదు, ఆరు బ్యాంకు ఖాతాల్లో రూ.3,76,50,595, 2015 మోడల్ ఆడి కారు (ప్రస్తుతం రూ.15లక్షల విలువ), 2014 మోడల్ మహేంద్ర బొలేరో(ప్రస్తుత విలువ రూ.లక్ష) 8తులాల బంగారం, 10కిలోల వెండి ఉన్నట్లు వెల్లడించారు.

స్థిరాస్తులు

తొర్రూర్‌లో రూ.1.60కోట్ల విలువైన 35 గుంటల భూమి, బొంగుళూర్‌లో రూ.3కోట్ల విలువ చేసే 2.32 ఎకరాల భూమి, కోహెడాలో రూ.19.30కోట్ల విలువ చేసే 20.20 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు.

నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్

మన్సూరాబాద్‌లో రూ.90 లక్షల విలువ చేసే 418 చదరపు గజాల స్థలం, కుంట్లూర్‌లో రూ.1.60కోట్ల విలువ చేసే రెండు ప్లాట్లు, హయత్‌నగర్ మండలం బహదూర్‌గూడలో రూ.3,86,93,610 విలువచేసే 1029 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉన్న భవనం, రాయదుర్గంలో కుమారుడు అభిషేక్‌రెడ్డితో కలిపి 1000 చదరపు అడుగులు స్థలం, (మల్‌రెడ్డి భాగం ప్రస్తుత విలువ రూ.65లక్షలు), రాయదుర్గంలో రూ.3.50లక్షల విలువ చేసే 161 చదరపు గజాల్లో భవనం, గచ్చిబౌలిలోని రూ.7.50కోట్ల విలువైన మీనాక్షి టెక్ పార్కులో 207 చదరపు గజాల్లో భవనం, సరూర్‌నగర్ మండలం ద్వారకపురంలో అపార్టుమెంట్‌లోని ప్లాట్ల షేర్ల విలువ రూ.7.50 కోట్లు, సంఘీ లెదర్స్ లిమిటెడ్‌లో షేర్స్ రూపంలో రూ.2.50 లక్షలు, మహాలక్ష్మీ థియేటర్‌లో 20శాతం షేర్ ఉన్నట్లు అఫడవిట్ పేర్కొన్నారు.

నివాస గృహాలు

చైతన్యపురి ప్రభాస్‌నగర్‌లో రూ.1.44 కోట్ల విలువైన 500 చదరపు గజాల్లో ఇల్లు, మాదాపూర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ అపార్టుమెంట్‌లో రూ.కోటి విలువ చేసే 1500 చదరపు అడుగుల ఫ్లాట్లున్నాయి. మొత్తం మల్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.59,75,93,610 కాగా అందులో రూ.1.60కోట్లు వారసత్వ ఆస్తిగా పేర్కొన్నారు.

అప్పులు

ఎస్‌బీఐ సైఫాబాద్ బ్రాంచ్‌లో తనయుడు అభిషేక్‌రెడ్డితో కలిపి తీసుకున్న రూ.6కోట్ల అప్పుల్లో మల్‌రెడ్డి భాగానికి రూ.3కోట్లు, అదే బ్యాంకులో మల్‌రెడ్డి మరో రూ.19,40,376 అప్పు చెల్లించాల్సివుందన్నారు.

సతీమణి అనసూయ పేరిట

అనసూయ చేతిలో రూ.3లక్షల నగదు, నాలుగు బ్యాంకు అకౌంట్లల్లో రూ.15,51,088 ఉన్నాయి. కిలో బంగారం, 5 కిలోల వెండి, రూ.28,867 సాలీనా చెల్లించే ఇన్సూరెన్స్ పాలసీ ఉన్నట్లు చూపారు.

వ్యవసాయ భూములు

కోహెడాలో రూ.9కోట్ల విలువ చేసే 11.2ఎకరాలు, బొంగుళూర్‌లో రూ.2.40 కోట్ల విలువైన 2.4 ఎకరాల భూమి ఉంది.

నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్

మక్తా మహబూబ్‌పేట్, శేరిలింగంపల్లిలో రూ.65 లక్షల విలువైన 998 చదరపు గజాల ప్లాటు, కమర్షియల్ భవనాలు హయత్‌నగర్ మండలం బహదూర్‌గూడలో 3,86,93,610 విలువచేసే 1029 చదరపు గజాల్లో నిర్మాణంలో ఉన్న భవనం, సరూర్‌నగర్ మండలం ద్వారకపురంలో అపార్టుమెంట్ రూ.3 కోట్ల విలువచేసే 4.5శాతం షేర్లు ఉన్నాయి.

నివాస గృహాలు

తొర్రూర్‌లో రూ.36 లక్షల విలువైన వెయ్యి గజాల స్థలంలో ఇల్లు, తిరుమల హిల్స్ రూ.5 కోట్ల విలువ చేసే 1012 గజాల్లో ఇల్లు, రూ.12లక్షల విలువచేసే 2017 మోడల్ ఇన్నోవాతో కలిసి మల్‌రెడ్డి రంగారెడ్డి భార్య అనసూయ ఆస్తుల విలువ రూ.18,97,93,610 ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపరిచారు. ఎస్‌బీఐ సైఫాబాద్ బ్రాంచ్‌లో రూ.4,46,897 అప్పులున్నట్లు తెలిపారు.

కళాజాత@ రేగడిమైలారం


బీఆర్ఎస్‌కు ప్రచారం చేస్తున్న కళాబృందం


కాంగ్రెస్ ప్రచారంలో రేగడిమైలారం యువ కళాకారులు

- ఎన్నికళ వేళ ప్రధాన పార్టీలకు ప్రచారం చేస్తున్న కళాకారులు
- 1995లో పొదుపు పథకం నుంచి శ్రీకారం
- గ్రామం నుంచి 50 మంది కళాకారులు

బొంరాస్‌పేట: కళాకారులకు పుట్టినిల్లు రేగడిమైలారం. యక్షగానాలు, వీధినాటకాలు, తోలు బొమ్మలాట, డోలు వాయిద్యాలు ఇలా అన్ని రకాల కళారూపాలకు ఆయుష్షు పోస్తూ ఆదరణ తెస్తోంది ఈ గ్రామం. మండల పరిధిలోని రేగడిమైలారం. జానపద కళారూపాలకు జీవం పోస్తూ కళాకారులకు ఉపాధి కల్పిస్తోంది. తాతల నాటి నుంచి ప్రతీ ఇంట్లో ఓ జానపద కళాకారుడు ఉన్నారు.

1995 నుంచి కళాజాత బృందాలు

కాలికి గజ్జకట్టి, నెత్తికి రుమాలు చుట్టి, డప్పు చంకనేసి, గొంగడి భుజానేసి జానపద కళారూపాల్లో ఆరితేరారు ఈ గ్రామ కళాకారులు. 1995లో ప్రభుత్వం పొదుపు పథకాన్ని ప్రారంభించింది. అందుకు జిల్లా అధికార యంత్రాంగం కళాజాత రూపంలో కళాకారులతో ప్రచారం నిర్వహించారు. మండలానికి ఓ కళాజాత బృందం ఉండగా బొంరాస్‌పేట మండలం నుంచి రేగడిమైలారానికి చెందిన కళాకారులు పది మంది పాల్గొన్నారు. మాలక్ష్మి, అక్షర కిరణం, సప్తస్వరాలు, ఆరోగ్యం, ఉపాధి వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలవద్దకు తీసుకెళ్లడానికి ఏర్పాటు చేసిన కళాజాత బృందాల్లో ఈ గ్రామం కళాజాత బృందం తప్పనిసరిగా ఉంటోంది. తెలంగాణ ధూంధాం కళాజాతల్లోనూ ఈ గ్రామ కళాకారులు ఎగిరి దుంకినోళ్లే. మొదటగా శ్యామలయ్యగౌడ్, బసప్ప(టీచర్), పరమేశ్వర్, కృష్ణయ్య, అంజిలప్ప, హన్మంతు, దశరథ్, నర్సిములు, ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి 1995లో కళాజాతలో స్వచ్ఛందంగా, ఉచిత ప్రదర్శనలో అడుగుపెట్టారు. సొంతంగా పాటలు రాయడం, పాడడం చేస్తున్నారు. అప్పటి నుంచి చెవిటి శ్రీనివాస్, అనితకుమారి, పెంటప్ప, మారుతి, కళ్యాణ్, మహేశ్, ప్రవీణ్, బాల్‌రాజ్, ఇలా 50మంది వరకు కళాజాత బృందాల్లో ఉంటున్నారు. పొరుగు గ్రామాలు నాజ్‌ఖాన్‌పల్లి, ఉడిమేశ్వరం, నాందార్‌పూర్, ఎన్కేపల్లి, ఎరన్‌పల్లి, ఏర్పుమళ్ల తదితర గారమాల్లోని కళాకారులను తయారుచేసి అన్ని గ్రామాలకు కళాజాతలో ఆదర్శం అయ్యారు.

ఎన్నికల ప్రచారాల్లో ధూంధాం..

రేగడిమైలారం నుంచి 50మంది ధూంధాం కళాకారులున్నారు. పార్టీలకు భిన్నంగా కళారూపాల్లో ప్రదర్శనలు చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ఈ గ్రామం నుంచి ఎన్నికల ప్రచారంలో కళాకారులగా పనిచేస్తున్నారు. ఓటర్లను దగ్గర చేర్చుకునేందుకు ఆయా రాజకీయ పార్టీలు కళాజాత వల విసురుతున్నాయి. ప్రచార వాహనాలు ఆటపాటలతో హోరెత్తిస్తున్నాయి. కళాజాత ప్రదర్శనలతో దుమ్మురేపుతున్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల పేరున పాటలు పాడుకున్నారు. నేతల ప్రచార ర్యాలీల్లో చిందేస్తున్నారు.